ప్రభుత్వ స్థలం పరిరక్షణలో తీవ్ర జాప్యం

- కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్న రెవెన్యూ అధికారులు
- ఈ స్థలంలో 11 ప్లాట్లు చేసి విక్రయించేందుకు యత్నాలు
- ప్రజాప్రతినిధులకు తెలిసినా పట్టించుకోని వైనం
- కనీసం స్థానిక కార్పొరేటర్ కూడా పట్టించుకోవడం లేదని స్థానికుల ఆగ్రహం


భగత్‌సింగ్‌నగర్‌లో ప్రభుత్వ స్థలానికి సంబంధించి లొకేషన్ స్కెచ్


ఈనెల 24వ తేదీన లొకేషన్ స్కెచ్ లేకుండా భగత్‌సింగ్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలంలో ముగ్గులు వేస్తున్న దృశ్యం

చింతల్: కబ్జాదారులకే అధికారులు కొమ్ముకాస్తున్నారనడానికి గాజులరామారం సర్కిల్ అధికారుల పనితీరే అందుకు నిదర్శనంగా మారింది. గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో ఉన్న 29 గుంటల ప్రభుత్వ స్థలం పరిరక్షించే విషయంలో అధికారులు కొన్నేళ్లుగా మోకాలడ్డుతూ కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారనడానికి ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. 2007లో అప్పటి ఎమ్మార్వో సర్వే చేయగా 3500 గజాలు (29 గుంటలు) ఉన్నట్లు నిర్ధారించారు. అనంతరం 2019లో చేపట్టిన సర్వే ప్రకారం 3553 గజాల స్థలం వచ్చింది. దీనికి అప్పటి జీహెచ్‌ఎంసీ అధికారులు 90 శాతం మేర ఫెన్సింగ్ పనులు పూర్తి చేశారు. సదరు స్థలానికి ఆనుకుని ఉన్న దోబీఘాట్ వాసులు ఇది తమ స్థలమంటూ అడ్డు తగలడంతో అధికారులు వెనుదిరిగారు. మిగిలిన 10శాతం మేర ఫెన్సింగ్ వేయాల్సి ఉంది. దానికి సంబంధించిన నిధులు సైతం మంజూరయ్యాయి. ఇక్కడే అసలు కథ మొదలైంది.

ఇప్పటికీ పూర్తికాని మిగిలిన 10శాతం ఫెన్సింగ్ పనులు

◆ గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి కంటే ముందుగా వచ్చిన డిప్యూటీ కమిషనర్ మిగిలిపోయిన 10 శాతం మేర ఫెన్సింగ్ కోసం నిధులను మంజూరు చేసి వెళ్లారు. ఆయన స్థానంలో డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లారెడ్డి వ్యవహారం కబ్జాదారులకు వత్తాసు పలికే ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్, ఇంజినీరింగ్ సెక్షన్ ఏఈ సంపత్, కిందిస్థాయి ఉద్యోగి డ్రాఫ్ట్‌మెన్ నరేష్‌లు చక్రం తిప్పుతూ ఉన్నతాధికారులను ఆదేశాలను బేఖాతరు చేస్తూ దోబీఘాట్ వాసులతో కుమ్మక్కైనట్లు భగత్‌సింగ్ వాసులు ఆరోపిస్తున్నారు.

కబ్జాదారులకు అనుకూలంగా ముగ్గులు వేసిన వైనం

◆ కబ్జాదారులతో కలిసి ప్రభుత్వ స్థలాన్ని 11 ప్లాట్లుగా చేసి విక్రయించేందుకు సహకరిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. 15 రోజుల క్రితం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి సూచనల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు లొకేషన్ స్కెచ్ లేకుండానే దోబీఘాట్ వాసులకు అనుకూలంగా ముగ్గు వేసి వెళ్లారు. బుధవారం మరలా డ్రాఫ్ట్‌మెన్ నరేష్ తమ సిబ్బందితో వచ్చి లొకేషన్ స్కెచ్ లేకుండానే కబ్జాదారులకు అనుకూలంగా ముగ్గులు వేసి జేబీసీతో తవ్వకాలు చేపట్టారు.

పత్తాలేని లొకేషన్ స్కెచ్..

◆ 10 శాతం మేర ప్రభుత్వ స్థలానికి ఫెన్సింగ్ పనులు మిగిలి ఉండగా దాని పూర్తి చేయాల్సిన డిప్యూటీ కమిషనర్ కబ్జాదారులకు లబ్ధి చేకూర్చేలా జిల్లా సర్వే అధికారులకు నివేదికను పంపారు. జిల్లా సర్వే అధికారులు లొకేషన్ గూగుల్ మ్యాప్‌ను కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులకు పంపగా దానిని చట్టబద్ధత చేయకుండా డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి ఇష్టానుసారంగా వ్యవహరించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వ స్థలం మొత్తం 3550 గజాలు ఉండగా 2వేల గజాలు మాత్రమే ఉన్నట్లు చూపిస్తూ దోబీఘాట్ వాసులకు అనుకూలంగా డీసీ వ్యవహరిస్తున్నారని స్థానికంగా ఆరోపణలున్నాయి.

పట్టించుకోని హ్యాట్రిక్ ఎమ్మెల్యే, కార్పొరేటర్..

◆ ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించి చుట్టూ రక్షణ కంచెను ఏర్పాటు చేయించే విషయంలో స్థానిక కార్పొరేటర్, ఎమ్మెల్యేలు ఉదాసీనంగా వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెరవెనుక ప్రజాప్రతినిధులు ఉండి కబ్జా చేసేందుకు కథ నడిపిస్తున్నారని, అందుకే అధికారులు కబ్జాదారులకు అనుకూలంగా పనిచేస్తున్నారనే అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే వివేకానంద్ ప్రభుత్వ స్థలం పరిరక్షణ విషయంలో తమ అనుచరుల ఒత్తిడితోనే వెనుకంజ వేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 7,24,992

14,400 మంది కొత్త ఓటర్లు

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ ఓటర్లు 7 లక్షల 24 వేల 992కు చేరుకున్నారు. ఇటీవల ఎన్నికల సంఘం నూతన ఓటర్ల నమోదుతో పాటు అడ్రస్‌లు మార్పిడి అవకాశం కల్పించింది. మార్చి 15వ తేదీ వరకు ఫామ్‌-6 ద్వారా 18,651 మంది నమోదు చేసుకోగా వారిలో 13,777 మంది అర్హులుగా గుర్తించగా 4874 మంది దరఖాస్తులను తిరస్కరించారు.

◆ అదే విధంగా ఫామ్‌-8 దరఖాస్తులు 12,126 వచ్చాయి. వాటిలో 8,480 దరఖాస్తులు ఆమోదించారు.

◆ అదే విధంగా ఫామ్‌-7 కింద 7409 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అందులో 6874 మందిని అర్హులుగా తేల్చారు.

◆ మార్చి 15వ తేదీ వరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 7,24,992కు చేరుకుంది.

◆ పురుషులు 3,78,362, మహిళా ఓటర్లు 3,46,468, ఇతరులు 162, సర్వీస్ ఓటర్లు 110 మంది ఉన్నారు.

◆ అదే విధంగా కొత్తగా 14,400 మంది యువత ఓటు హక్కును పొందారు. అదే విధంగా సీనియర్ సిటిజెన్స్ 2,063 మంది, దివ్యాంగులు 5828 మంది ఓటర్లుగా నమోదయ్యారు.

కాంగ్రెస్ ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరు


సూర్యనగర్‌లో కరపత్రాలను పంచుతున్న కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరని.. మల్కాజ్‌గిరి అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శుక్రవారం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని సూర్యానగర్, రామిరెడ్డినగర్, పాపయ్యయాదవ్‌నగర్‌లలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలే పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వర్‌రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, రాధాకృష్ణ, దుర్గారావు, నర్సింహారెడ్డి, పెంటయ్య, వెంకటేష్ యాదవ్, లింగం, వెంకటేష్, అశోక్, సుజాత, హైమావతిరెడ్డి, అశ్విని, భవానీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో మేధో సంపత్తి హక్కులు కీలకం



మాట్లాడుతున్న ప్రొ.జీబీ రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ లా కాలేజీలో ప్రపంచ మేధోసంపత్తి హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం కాలేజీ సెమినార్ హాల్లో డీపీఐఐటీ ఐపీఆర్‌-చైర్, ఓయూ ఐపీఆర్ సెల్, టీఎస్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీఎస్ కాస్ట్) ఆధ్వర్యంలో ఐపీ అండ్ ద ఎస్‌డీజీలు బిల్డింగ్ అవర్ కామన్ ఫ్యూచర్ విత్ ద ఇన్నోవేషన్ అండ్ క్రియేటివిటి అనే అంశం పై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి లా కాలేజీ సీనియర్ ప్రొఫెసర్.జీబీ రెడ్డి అధ్యక్షత వహించగా ఐఎఫ్‌ఎస్ అధికారి శ్రీలక్ష్మీ హాజరై మాట్లాడారు. సుస్థిర అభివృద్ధిలో మేధో సంపత్తి హక్కులు కీలకమన్నారు. జనీవాలో 1970 ఏప్రిల్ 26న ప్రపంచ మేధో హక్కుల చట్టాన్ని ఆమోదించారని, 2000 సంవత్సరం నుంచి ఏప్రిల్ 26న ప్రపంచ వ్యాప్తంగా మేధో హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని ప్రొ.జీబీ రెడ్డి వివరించారు. ప్రతి ఏటా ఒక్కొక్క అంశం పై నిర్వహిస్తున్న ప్రపంచ మేధో హక్కుల దినోత్సవాన్ని ఈ ఏడాది సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, మేధో సంపత్తి హక్కుల పాత్ర అనే అంశం పై జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో ప్రిన్సిపల్ ప్రొ.రాధిక యాదవ్, లా డీన్, హెడ్ ప్రొ.విజయలక్ష్మీ, సీనియర్ న్యాయవాది అశోక్ రామ్‌కుమార్, సుఖ్‌దేవ్ కాటమ్ పాల్గొన్నారు.

నేటి నుంచి జీతేపీర్ దర్గా ఉర్సు

నిజాంపేట్: బాచుపల్లిలోని జీతేపీర్ దర్గా ఉర్సు ఉత్సవాలను ఈనెల 27 నుంచి ప్రారంభమవుతాయని దర్గా కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. 27న సందాల్, 28న చిరాగన్, 29న మీనా బజార్ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొంది.

నేటి కాంగ్రెస్ సమావేశానికి పెద్ద ఎత్తున తరలి రావాలి

కుత్బుల్లాపూర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా శనివారం నిర్వహించే సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆ పార్టీ నేతలు ఓ ప్రకటనలో తెలిపారు. దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లి మేకల వెంకటేశం ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10.30 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి, ఎన్నికల నియోజకవర్గ పరిశీలకురాలు శోభారాణి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

29 నుంచి చిత్రలేఖనంలో శిక్షణ తరగతులు

నిజాంపేట్: వేసవి సెలవులను పురస్కరించుకుని ప్రగతినగర్‌లోని సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చిత్రలేఖనంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు సత్యవోలు రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 నుంచి మే 24వ తేదీ వరకు కొనసాగే శిక్షణలో డ్రాయింగ్, కలర్ పెయింటింగ్, ఆయిల్ పెయింటింగ్, ఆక్రిలిక్ కలర్ పెయింటింగ్, ప్రొట్రైట్ డ్రాయింగ్, అనాటమి డ్రాయింగ్, నైఫ్ పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్ ఇంప్రూవ్‌మెంట్‌లలో శిక్షణ ఇవ్వనున్నారు. ఐదేళ్ల పిల్లల నుంచి పెద్దల వరకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఫోన్ నం .99599 71679 / 98494 90663లో సంప్రదించాలని కోరారు.

హన్సికకు ఎమ్మెల్యే అభినందనలు

కుత్బుల్లాపూర్: ఇంటర్ ఫలితాల్లో స్టేట్‌ర్యాంక్ సాధించిన ఎస్‌ఆర్ నాయక్‌నగర్‌కు చెందిన విద్యార్థి హన్సికను ఎమ్మెల్యే వివేకానంద్ అభినందించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హన్సిక ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన హన్సిక రాష్ట్ర ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఉన్నత చదువులకు ఢోకా లేకుండా తన వంతు సహాయం అందజేస్తానన్నారు. విద్యార్థిని తండ్రి వెంట్రారామయ్య, బీఆర్‌ఎస్ నాయకుడు లక్ష్మీనారాయణ, శేషాచారి, వేణు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

పిల్లల్లో అక్షర జ్యోతిని వెలిగించాలి

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్: పిల్లల్లో అక్షర జ్యోతిని వెలిగిస్తే జ్ఞానం పెరుగుతుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ తెలుగుతల్లినగర్‌లో దళిత సంఘాల ఐక్య కార్యాచరణ సమితీ ఆధ్వర్యంలో మహనీయుల జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే వంటి మహనీయుల త్యాగాల ఫలితమే నేటి మన జీవన గమనమన్నారు. అటువంటి మహనీయులను సేవలను స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, నిర్వాహకులు గొనీ శంకర్, తారాసింగ్, కరాటే శీను, కుమార్, జేమ్స్, గట్టు అశోక్, వీరేశం, శ్రీ పాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం

కుత్బుల్లాపూర్: గాజులరామారం శ్రీరామ్‌నగర్‌లోని రేణుకాఎల్లమ్మ, పోచమ్మ నాగ దేవాలయంలో గురువారం విగ్రహాల పునః ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారిని కొలవడం ద్వారా కార్యసిద్ధితో పాటు అష్టైశ్వర్యాలు చేకూరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ పరిష శ్రీనివాస్ యాదవ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, చిన్న చౌదరి, బాబి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వివేకానంద్‌కు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

విశ్వవిద్యాలయాలు.. పరిశోధనలకు నిలయాలు

పద్మభూషణ్ డా.సారస్వత్

ఉస్మానియా యూనివర్సిటీ: విశ్వవిద్యాలయాలు పరిశోధనలకు నిలయాలని నిత్యం కొత్త విషయాల దిశగా అన్వేషించాలని నీతి ఆయోగ్ సభ్యులు, డీఆర్‌డీవో విశ్రాంత డీజీ, పద్మభూషణ్, ఓయూ పూర్వ విద్యార్థి, డాక్టర్ విజయ్ కుమార్ సారస్వత్ అన్నారు. శుక్రవారం ఓయూ 107 ఫౌండేషన్ డే సందర్భంగా వర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాలేజీల్లో విద్యా ప్రయాణం మాత్రమే ఉంటుందని వర్సిటీల్లో ఎంచుకున్న రంగంలో నాణ్యత ప్రమాణాలతో కూడిన పరిశోధనలు జరగాలన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో వివిధ అంశాలపై జరిగే పరిశోధనలు సమాజంపై ప్రభావం చూపాలని సమాజంలోని అశాస్త్రీయ అంశాల ప్రభావం వర్సిటీలపై పడకూడదన్నారు. దేశ ఆర్థిక, సామాజిక, విజ్ఞానాభివృద్ధి తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విద్యా సంస్థలు పరిశ్రమలు, లాబోరేటరీలతో కలిసి పరిశోధనలు మరింత పెంచాలన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యారంగానికి ఓయూ గురువులాంటిదని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, ఓయూ పూర్వ విద్యార్థి బుర్రా వెంకటేశం పేర్కొన్నారు. టాలెంట్, ట్రైనింగ్, టెక్నాలజీ, ట్రెడిషన్ నాలుగు టీలను అనుకరిస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. ఓయూ ఫౌండేషన్ సందర్భంగా మూడు రోజులు జరిగిన కార్యక్రమాలలో భాగంగా ఈ నెల 25న నిర్వహించిన ఓపెన్ డేకు నగరంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 50 వేల మంది విద్యార్థులు వర్సిటీని సందర్శించి వివిధ అంశాలను తెలుసుకున్నట్లు వీసీ ప్రొ.రవీందర్ పేర్కొన్నారు. అమెరికాలోని ఇమాజియా కార్పొరేషన్ సీఈవో, ఓయూ పూర్వ విద్యార్థి వీణ గుండవల్లి, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీ నారాయణ, డీన్ ప్రొ.మల్లేశం పాల్గొని ప్రసంగించారు. అనంతరం వీసీ ప్రొ.రవీందర్ రచించిన పుస్తకాన్ని, రాకేష్ శర్మ ప్రసంగ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఏ ప్రాంతంలో చూసినా రోజుల తరబడి రోడ్ల వెంబడి పేరుకుతున్న చెత్తను తరలించకపోవడంతో తీవ్ర దుర్గంధం వ్యాప్తిస్తోంది. కుత్బుల్లాపూర్ సర్కిల్ జీడిమెట్ల డివిజన్ పరిధి ఎన్‌సీఎల్ సౌత్‌లోని ప్రధాన రోడ్డు వెంబడి చెత్తను తొలగించడంలో పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై అసోసియేషన్ ప్రతినిధులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన స్పందన కరువైందని వాపోతున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చెత్తను ఎప్పటికప్పుడు తరలించే ఏర్పాట్లు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


ఎన్‌సీఎల్ సౌత్‌లో రోడ్డు వెంబడి పేరుకుపోయిన వ్యర్థాలు

మ్యాన్‌హోళ్లలో పేరుకుపోతున్న వ్యర్థాలు

తొలగించడంలో అధికారుల నిర్లక్ష్యం

రంగారెడ్డినగర్: భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసే విషయంలో జలమండలి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మ్యాన్‌హోళ్ల నిర్వహణ ఉండగా రెండేళ్ల క్రితం జలమండలికి బదిలీ చేశారు. అయినా డ్రైనేజీ లైన్లు, మ్యాన్‌హోళ్లలో పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగించడంలో సంబంధిత అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రతినిత్యం ఆయా ప్రాంతాల్లో గల్పర్ వాహనాలతో డ్రైనేజీ పూడికలను తీయాల్సి ఉండగా వాటిపై పర్యవేక్షణ కొరవడటంతో మురుగు ఏరులై పారుతోంది.


షాపూర్‌నగర్ మార్కెట్ రోడ్డులో మ్యాన్‌హోల్ నుంచి పొంగుతున్న మురుగు

- షాపూర్‌నగర్ మార్కెట్ రోడ్డును ఆనుకుని ఉన్న పలు గల్లీల్లో 24/7 డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లడంతో రోడ్లన్నీ చిత్తడి మారుతున్నాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించేందుకు పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షాపూర్‌నగర్ ఓల్డ్ పోస్టాఫీస్ గల్లీలో ప్రతినిత్యం మురుగు పారుతూనే ఉంది. సంబంధిత అధికారులు ఇకనైనా మొద్దునిద్రను వీడి మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.


షాపూర్‌నగర్ ఓల్డ్ పోస్టాఫీస్ వీధిలో చిత్తడిగా మారిన రోడ్డు

విదేశీవిద్య 'స్కాలర్‌షిప్స్'కు సహకారం

సాక్షి, సిటీబ్యూరో: విదేశాల్లో విద్యాభ్యాసం చేయాలనుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్ సహిత ప్రవేశాలను అందించడంలో సహకారం అందించనున్నట్లు నగరానికి చెందిన జూనియర్ కళాశాల టెక్సాస్ ఇంటర్నేషనల్ అకాడమీ ప్రతినిధులు తెలిపారు. అమెరికాలో బీటెక్ చేయాలనుకునే 11వ, 12వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలతో ప్రారంభించి ఐఈఎల్ టీఎస్/టోఫెల్ తయారీ, అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకు అప్లికేషన్ వరకూ మద్దతు అందిస్తామని, వీసా సహాయం, మెరిట్ లేదా అవసరాల ఆధారితంగా ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర స్కాలర్‌షిప్‌లు అందుకోవటంలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. యూఎస్‌ఏకు అధ్యయన పర్యటనలకు కూడా సహాయ పడతామని వివరించారు.

ఇంగ్లిష్ లెర్నింగ్ టూల్ ఆవిష్కరణ

ప్రయోగాత్మకంగా మొయినాబాద్ ప్రభుత్వ పాఠశాలలో పరిశీలన

రాయదుర్గం: మాట్లాడే భాషలో నైపుణ్యం కోసం అన్వేషించే ఔత్సాహికులకు సహాయపడే సాధనాన్ని గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. ఆర్థిక అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు కీలకం ఇంగ్లిష్. ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలు ఆంగ్లం నేర్చుకునే వనరులు అందుబాటులో లేవు. దీనిని అధిగమించడానికి ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని రాజ్‌రెడ్డి సెంటర్ ఫర్ టెక్నాలజీ అండ్ సొసైటీ (ఆర్‌సీటీఎస్) పరిశోధకులు ఇంగ్లిష్ స్పీచ్ మూల్యాంకనానికి టీచింగ్ అసిస్టెంట్‌గా ఉపయోగపడే ఇంగ్లిష్ లెర్నింగ్ టూల్‌ను అభివృద్ధి చేశారు. ట్రిపుల్‌ఐటీలోని ఆర్‌సీటీఎస్‌లోని సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ అర్జున్ రాజశేఖర్ మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీలోని లాంగ్వేజ్ టెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ (ఎల్ టీఆర్‌సీ)లోని స్పీచ్ ప్రాసెసింగ్ ల్యాబ్ నుంచి ప్రొఫెసర్ చిరంజీవి యర్రా అభివృద్ధి చేసిన స్పీచ్ అసెస్‌మెంట్‌ను తరగతి గదిలో అభ్యాస సాధనంగా ఉపయోగించవచ్చన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మార్చిలో ఈ అప్లికేషన్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేయడంతో విద్యార్థులు ఉత్సాహంగా స్వీకరించారు.

హెచ్‌సీయూకు ఇండియన్ పేటెంట్ మంజూరు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఇండియన్ పేటెంట్ మంజూరు చేశారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ నుంచి ప్రొఫెసర్ రాజదురై చంద్రశేఖర్, అతని పూర్వ పీహెచ్‌డీ విద్యార్థి డాక్టర్ వప్పు వినయ్ ప్రదీప్‌కు 'మాలిక్యులర్ సింగిల్‌-క్రిస్టల్ ఫోటోనిక్ మైక్రో-రెసోనాటర్స్ అండ్ ఫర్మేథింగ్ పర్మేషన్ ఆవిష్కరణ కోసం భారతీయ పేటెంట్ చేయబడింది. పేటెంట్ చట్టం 1970లోని నిబంధనలకు అనుగుణంగా 20 సంవత్సరాల కాలానికి ఈ పేటెంట్‌ను అందించారు. ప్రస్తుత ఆవిష్కరణ అనేక ఫోటోనిక్ అప్లికేషన్‌లలో ఉపయోగపడే పరమాణు సింగిల్ క్రిస్టల్‌తో కూడిన మైక్రో రెసోనేటర్‌లను అందిస్తుంది. ప్రొ.రాజదురై చంద్రశేఖర్ ఆర్గానిక్ సింగిల్‌-క్రిస్టల్ ఫోటోనిక్ భాగాలను రూపొందించే సాంకేతికతకు 'క్రిస్టల్ ఫోటోనిక్స్ ఫాండ్రీ' అని పేరు పెట్టారు. ఇండియన్ పేటెంట్ పొందడం పట్ల పలువురు ప్రొఫెసర్లు వారిని అభినందించారు.

ఇండియన్ హెరిటేజ్ ఆర్ట్ టూర్ ప్రారంభం

ఆర్ట్ గ్యాలరీలో ప్రారంభించిన నటి స్రవంతి

లక్డీకాపూల్: శిల్పాభా పేరుతో ప్రతికృత్, పాప్పానితో ఏర్పాటైన ఇండియన్ హెరిటేజ్ ఆర్ట్ టూర్ హైదరాబాద్‌లో శుక్రవారం ప్రారంభమైంది. భారతదేశపు ప్రాచీన సంప్రదాయ జానపద కళా చిత్రాలను పరిరక్షించే క్రమంలో ప్రజలకు అవగాహన కల్పించే దిశగా ఈ ఆర్ట్ టూర్ కొనసాగుతుంది. శుక్రవారం మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో తెలంగాణ ప్రముఖ విజువల్ ఆర్టిస్ట్, నటి స్రవంతి జులూరి ఆర్ట్ టూర్‌ను ప్రారంభించారు. ప్రముఖ కళాకారులు సరస్వతి లింగంపల్లి, అన్నపూర్ణ మడిపడిగ, మరేడు రామ్ హాజరైన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ ఆర్ట్ టూర్‌తో భారతదేశపు 6వ శతాబ్దానికి చెందిన కళా సంప్రదాయాలకు మరింత ఆదరణ తెచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. శనివారం నుంచి రెండు రోజుల పాటు 'శిల్పాభా' కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు చెరియాల్ స్క్రోల్ పెయింటింగ్ వర్క్‌షాప్ ఉంటుదని..దీనిని తెలంగాణలోని చెరియాల్ కళాకారులు ఎస్. గణేష్, వనంజా నిర్వహిస్తారన్నారు.

ప్రైవేటు స్థలం విషయంలో వివాదం

ఇరువర్గాలకు నచ్చజెప్పిన పోలీసులు

దుండిగల్: ఓ ప్రైవేటు స్థలంలో నెలకొన్న వివాదంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దడంతో గొడవ సద్దుమణిగింది. దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లాపూర్ సర్వే నం.235లో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులతో పాటు ఇతర ప్రాంతానికి చెందిన వారికి స్థలాలు ఉన్నాయి. కాగా గత కాలంగా ఇరు వర్గాల మధ్య స్థల వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో శుక్రవారం ఇరు వర్గాలు స్థలం తమదంటే.. తమదంటూ గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న దుండిగల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరు వర్గాలకు నచ్చజెప్పడంతో శాంతించారు.

నేడు 'రాజ్యాంగ విలువలు- ప్రజాస్వామ్యం సవాళ్లు'పై సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: రాజ్యాంగ విలువలు- ప్రజాస్వామ్య సవాళ్లు, పౌరుల పాత్ర అనే అంశంపై నేడు (27న) సదస్సు జరగనుంది. పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ 121వ తరగతి గదిలో ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి జేఎన్‌యూ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.యోగేంద్ర యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నట్లు రిసెర్చ్ స్కాలర్ నెల్లి సత్య పేర్కొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా లభిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కామర్స్ కాలేజీ సీనియర్ అధ్యాపకులు ప్రొ.అప్పారావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసి రెండు రోజుల జాతీయ సదస్సుకు సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ప్రొ.చెన్నప్ప, ప్రొ.నరేష్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ

అమీర్‌పేట: సీఏ, సీఎంఏ, సీయూఐటీ, సీఎల్‌ఏటీ, ఐపీఎంఏటీ వంటి పోటీ పరీక్షలకు హాజరవుతున్న ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు 3 నెలల పాటు షార్ట్, లాంగ్ టర్మ్ ద్వారా ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు సీఎంఎస్ విద్యా సంస్థల చైర్మన్ చంద్రశేఖర్ తెలిపారు.శుక్రవారం సాయంత్రం ఎస్‌ఆర్‌నగర్‌లోని కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అతి తక్కువ సమయంలోనే ఉన్నత స్థాయికి చేరుకోగల కామర్స్ రంగంలో ఉద్యోగల అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. ఆసక్తిని ఉన్న వారు 9573997799, 9573992299 నంబర్లలో సంప్రదించాలన్నారు.